క్లుప్తంగా

ఉపకులాలకు సమాన హక్కులు కల్పించాలి



నిరసన తెలియజేస్తున్న దళిత హక్కుల పోరాట కమిటీ నాయకులు

సింధియా : ఎస్సీ వర్గీకరణ చేస్తే 59 ఉపకులాలకు సంబంధించి భారత రాజ్యాంగంలో ఉన్న హక్కులను సరి సమానం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకుడు గుడాల రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవలోని భగత్‌సింగ్ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పదేళ్ల నుండి రిజర్వేషన్ల జోలికి వెళ్లని ప్రభుత్వాలు ఇప్పుడు ఎస్సీ వర్గీకరణకు సిద్ధపడటం సరి కాదన్నారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో దళితులకు బడ్జెట్ కేటాయించలేదని, దీనిపై ఇప్పటికే వివిధ దళిత సంఘాలు అర్జీలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ అంశాలపై ఈ నెల 13వ తేదీన విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తుందన్నారు. పోరాట కమిటీ నాయకులు, దళిత సోదరులు ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కామేశ్వరరావు, కనకరాజు, రంగాల అప్పారావు, శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన వృద్ధురాలు



గౌరినాయుడుకు పైడమ్మను అప్పగిస్తున్న షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి

అల్లిపురం : కుమార్తెతో కలిసి విజయనగరం వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చిన వృద్ధురాలు తప్పిపోయింది. శనివారం రాత్రి ఆమెను గుర్తించిన టూటౌన్ పోలీసులు ఏయూటీడీ సిబ్బందికి ఆమెను అప్పగించారు. ఆమె మూగ, చెముడు కావటంతో ఏయూటీడీ సిబ్బంది ఆమె వద్ద గల పెన్షన్ స్లిప్ ఆధారంగా మద్దిలపాలెం పరిసర ప్రాంతాల్లో గల సచివాలయాలకు ఆమె వివరాలను పంపించి చిరునామా తెలుసుకున్నారు. ఆమె పేరు పైడమ్మగా గుర్తించి ఆమె కుమార్తె ఫోన్ నంబర్‌ను కనుక్కున్నారు. దీంతో మద్దిలపాలెంలో ఉంటున్న ఆమె మనవడు గౌరినాయుడుని పిలిపించి అప్పగించారు. పైడమ్మ మనవడు తమ అమ్మమ్మను రక్షించి, ఆశ్రయం కల్పించిన ఏయూటీడీ మహిళా షెల్టర్ నిర్వాహకురాలు జ్యోతిర్మయికి, సిబ్బందికి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీ హార్బర్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

జగదాంబ : హార్బర్ పోలీసు స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బంది ప్రజలతో మమేకం కావాలని తెలిపారు. స్టేషన్‌కు వచ్చిన వారిని కూర్చోబెట్టి మాట్లాడాలన్నారు. సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పెండింగ్ కేసులు లేకుండా పరిష్కరించాలన్నారు. సిబ్బందికి కుటుంబం, ఉద్యోగపరంగా సమస్యలుంటే వెంటనే 7995095799 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. క్రైం పోలీసు స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనాలు శిథిలం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోర్టు పరిసర ప్రాంతాల్లో ఎటువంటి దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసింగ్ చేయాలన్నారు.

స్నేహబంధము.. ఎంత మధురము

గోపాలపట్నం హైస్కూల్‌లో ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఎమ్మెల్యే గణబాబును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



గోపాలపట్నం హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులతో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: స్నేహ బంధం విడదీయరాని అనుబంధమని ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987–88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వీరు మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

గతంలో పాఠశాల 100 ఏళ్ల పండగ ఘనంగా చేశామన్నారు. అదే విధంగా పాఠశాల ఏర్పాటైన నాటి నుంచి ఇక్కడ చదువుకున్న వారిందరినీ ఒక చోటకు చేర్చి కమిటీ ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీని ద్వారా పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం మంచి పరిణామమని తెలిపారు. స్నేహితులు స్వార్థరహితంగా.. అన్ని విషయాల్లో తోడు నీడగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కత్తరించి అందరికీ పంచి పెట్టారు. ఎమ్మెల్యే గణబాబు, జియ్యాని శ్రీధర్‌ను ఘనంగా సత్కరించారు. కేర్ సంస్థ సౌజన్యంతో వైద్య శిబిరంలో స్నేహితులంతా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంట్ల శ్రీనుబాబు, కేవీ నరసింహం, నక్కాన చంద్రశేఖర్, ప్రసన్న మాస్టర్, అప్పారావు, సుబ్బారావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలకు కొత్త మోటారు

బాలికల ఉన్నత పాఠశాలలో మంచి నీటి మోటారు పని చేయడం లేదని పూర్వ విద్యార్థులకు తెలియడంతో విశాఖ విమానాశ్రయ సలహా మండలి సభ్యుడు, జర్నలిస్టు గంట్ల శ్రీనుబాబు స్పందించారు. మరమ్మతులకు గురయిన మోటార్ స్థానంలో కొత్త మోటార్ అందిస్తానని ప్రకటించారు. ఈ నెల 18న ఈమోటార్‌ను ఏర్పాటు చేసి ప్రారంభిస్తామని తెలిపారు.

వాకర్స్‌కు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

డిప్యూటీ మేయర్ శ్రీధర్



వాకర్స్ సభ్యులతో డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: నగరంలోని పార్కుల్లో వాకర్స్‌కు సౌకర్యవంతంగా ఉండేలా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు పరిధిలోని మద్రిపాలెం వుడా అవుట్ పార్కులో ఆదివారం ఉదయం హెల్తీ వాకర్స్ సభ్యులతో సమావేశమయ్యారు. వారితో కలసి కొద్దిసేపు గ్రీన్‌బెల్ట్ పార్కులో వాకింగ్ చేశారు. గ్రీన్ బెల్ట్ పార్కులో ఇంకా ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే దానిపై వాకర్స్ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజానీకానికి సౌకర్యవంతంగా ఉండేలా పార్కులను తీర్చిదిద్దుతున్నామన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రతి రోజూ వ్యాయామం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఇది ఎంతో శుభపరిణామమన్నారు. అందుకే పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిని మరింత అభివృద్ధి చేసేలా తగిన కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు.పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పనులు చేపడతామన్నారు. గ్రీన్ బెల్ట్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న 'వనితా వాకింగ్ ట్రాక్'ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో హెల్తీవాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కొలుసు నాగేశ్వరరావు, ఈటి సత్యనారాయణ, జాకబ్, లక్ష్మణరావు, విజయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు

బీచ్ రోడ్డు: గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారులకు సోమవారం నుంచి బుధవారం వరకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయనున్న ట్టు ఆంధ్ర ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పి.వి.రామారావు తెలిపారు. క్యాంపు వివరాలను ఆది వారం మీడియాకు ఆయన వివరించారు. విశాఖపట్నంలోని ఆంధ్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో హీలింగ్ లిటిల్ హార్ట్స్, యూకే చారిటీతో కలిసి ఈ క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు సాగే ఈ క్యాంపులో ఆంధ్ర హాస్పిటల్స్ కార్డియాలజిస్టులతో పాటు ఇంగ్లాండ్ నుంచి ప్రత్యేకంగా డాక్టర్స్ టీం పాల్గొంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 88866 79733, 0891–2724777 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సింధియా: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు ఇబ్బందిగా పరిణమించే నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు షిప్‌యార్డ్ సమీపంలోని వాల్‌చంద్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సత్యాంజనేయ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. సెప్టెంబర్ 1,2,3 తేదీల్లో స్టీల్‌ప్లాంట్‌లోని గురజాత కళాక్షేత్రంలో నిర్వహించే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరూ పోరాడాలని, సమాన పనికి సమాన వేతనం ఇచ్చే విధంగా చట్టాన్ని తీసుకురావాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బూసి వెంకటరావు, షిప్‌యార్డ్ నాయకులు మధుసూదనరావు, శ్రీనివాస్, సీపీఐ నాయకుల గుడాల రాంబాబు, నూనెల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మురుగు జామ్..!

- మేజర్ కాలువలపై ఆక్రమణలు
- వర్షాకాలంలో తప్పని ఇబ్బందులు



గాంధీ నగర్ వద్ద మేజర్ డ్రెయిన్ ఆక్రమణ ఇలా..



ఎన్ఏడీ వరలక్ష్మి బార్ వద్ద ఇలా... (ఇన్‌సెట్) బీఆర్‌టీఎస్ రోడ్‌కు ఉన్న మేజర్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన పూడిక

విశాఖ విద్య: డ్రైనేజీల నిర్వహణను జీవీఎంసీ అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిస్తే కాలువల్లో నీరు నిలిచిపోతోంది. రోడ్లపైకి మురుగునీరు పొంగుతోంది. జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని కాలనీల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి ఉంది. గాంధీనగర్ నుంచి గవరవీధి వరకు ఉన్న మేజర్ డ్రైనేజీపై ఆక్రమణలతో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఎగువన ఉన్న కొండవాలు ప్రాంతంలోని కాలనీలు మొదలుకొని లక్ష్మీ నగర్ ఎఫ్ బ్లాక్, ఏపీఎస్ఈబీ కాలనీ, బుచ్చిరాజుపాలెం, సుసర్ల కాలనీల నుంచి వచ్చే మురుగు నీరంతా ఇదే డ్రైనేజీ నుంచి దిగువన గల గవర వీధి వరకు వెళ్లి అక్కడ నుంచి రైల్వే ట్రాక్‌కు ఆనుకొని ఉన్న కాలువ మీదగా హైవేకు అటువైపు ఉన్న 52 వార్డు మీదగా కిందకు పారుతుంది.



బుచ్చిరాజుపాలెంలో..

ఆక్రమణల బెడద

90వ వార్డు పరిధిలో కాలువలన్నీ ప్రస్తుతం ఆక్రమణకు గురయ్యాయి. దీంతో ప్రధానంగా గవరవీధి వద్ద కల్వర్టు లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీటి ఉధృతికి చెత్తచెదారం అంతా ఇక్కడ నిలిచి పోతుంది. దీంతో మురుగునీరు కిందకు పోయే మార్గం లేక సమీపాన ఉన్న ఇళ్లల్లోకి వస్తోంది. దీని వల్ల పరిసర ప్రాంతం అంతం అంతా దుర్గంధం వెదజల్లుతోంది. నగర పాలక సంస్థ అధికారులు దృష్టి సారించి సమస్యకు చెక్ పెట్టేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా కాలువలపైఉన్న ఆక్రమణలు తొలగిస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

సంచార జాతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు గౌడ్



రాజు గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరిస్తున్న సంఘం సభ్యులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచార జాతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుల నుంచి ఆదివారం ఉత్తర్వులు అందుకున్నట్లు రాజ్ గౌడ్ తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాజు గౌడ్‌ను ఆయా కులాల ప్రతినిధులు పెదవాల్తేర్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 32 కులాలు మోస్ట్ బ్యాక్వర్డ్ క్లాసెస్ ఉన్నాయన్నారు. గత కొన్నేళ్లుగా ఉత్తరాంధ్రలోని యాత కులం సామాజిక అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి చేస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన అన్ని కులాల ప్రగతికి కృషి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయుడు, గెద్దాడ రమేష్, బొంతు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' సమస్యల పరిష్కారానికి సంజీవరావు ఎనలేని కృషి



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఏసీపీ త్రినాథ్, జీఎంలు, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారంలో హెచ్ఆర్ జీఎం కె.సంజీవరావు కీలక పాత్ర పోషించారని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పదవీ విరమణ చేసిన హెచ్ఆర్ జీఎం కంచర్ల సంజీవరావును సీ భవన్‌లో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఏసీపీ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పారిశ్రామిక సంబంధాలు మెరుగుకు సంజీవరావు ఎనలేని కృషి చేశారన్నారు. యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు సంజీవరావు సంధానకర్తగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపేవారన్నారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ తమ అసోసియేషన్, ఓబీసీ అసోసియేషన్‌ల బైలాస్ తయారు చేయడంతోపాటు సంఘాలను విజయవంతంగా ముందుకు నడిపించడంలో సంజీవరావు ముఖ్య భూమిక వహించారన్నారు. ముందుగా మహనీయులు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, బిర్సా ముండా చిత్రపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టీల్‌ప్లాంట్ జీఎంలు ఎన్.భాను, ఎం.మధుసూదనరావు, ఠాగూర్, జయ కుమార్, డాక్టర్ నాగరాజు, వివిధ సంఘాల నాయకులు కె.వి.డి.ప్రసాద్, మాటూరి శ్రీనివాసరావు, పరమట సత్యనారాయణ, జి.బోసుబాబు, ఎస్.సత్యనారాయణ, ఎస్.మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సిటిజన్ ఫోరం నూతన కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

దాబాగార్డెన్స్ : విశాఖ సిటిజన్ ఫోరం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నగరంలోని రెడ్నంగార్డెన్స్‌లో గల ఓ హోటల్లో నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీవీ ఆర్ నాయుడు (గణబాబు) పాల్గొని నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోరం సేవలను కొనియాడారు. నాగార్జున విశ్వ విద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్ ఫోరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఫోరం నాయకుడు, విద్యార్థి వెంకట్రావు మాట్లాడుతూ ఫోరం ప్రారంభించి 13 ఏళ్లుగా సేవలందిస్తున్నామన్నారు. అనంతరం ఫోరం గౌరవ అధ్యక్షుడిగా పి. వెంకట్రావు, అధ్యక్షుడిగా పీఎస్ తిలక్, ఉపాధ్యక్షుడిగా కె. సత్యనారాయణ, కార్యదర్శిగా పి. రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా బి. సీతారామయ్య, కోశాధికారిగా పి. రాము, సహాయ కోశాధికారిగా ఎన్. సోమునాయుడుతో పాటు నలుగురు సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పలువురు ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

గీతం ఆస్పత్రి వద్ద మృతుని బంధువుల ఆందోళన



ఆందోళన చేస్తున్న సురేష్ భార్య ఝాన్సీ, కుటుంబ సభ్యులు



సంఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వైద్యుల నిర్లక్ష్యంతోనే భర్త చనిపోయాడని భార్య ఆరోపణ

కొమ్మాది : వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడంటూ ఓ మహిళ గీతం ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన పంతం సురేష్ (37) శనివారం ఉదయం ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుండగా ఆయన భార్య ఝాన్సీ చికిత్స నిమిత్తం రుషికొండలో గల గీతం ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం ఉదయం వరకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉందని ఎక్కించారని, పరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్య శ్రీకి దరఖాస్తు చేసుకోమని వైద్యులు సూచించినట్లు ఆమె తెలిపారు. అయితే అన్నీ అయిన తర్వాత ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు సురేష్ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా జూనియర్ వైద్యులతో వైద్యం అందించారని, కనీసం రక్తం ఎక్కించడం కూడా చేతకాని జూనియర్ వైద్యులతో చికిత్స చేయించడం వల్లే తన భర్త చనిపోయాడంటూ ఝాన్సీ ఆరోపిస్తున్నారు. ఆమెతోపాటు కుటుంబ సభ్యులు ఆస్పత్రి ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. ముమ్మాటికీ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త చనిపోయాడని, ఇప్పుడు మృతదేహాన్ని ఇవ్వమంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రెండు రోజులపాటు వైద్యం చేస్తున్నట్లు ఇక్కడి డాక్టర్లు హడావిడి చేశారని, ఉదయం నుంచి కోలుకుంటున్న వ్యక్తి సాయంత్రమయ్యేసరికి ఎలా చనిపోతాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లమని ఆదోళన చేశారు. విషయం తెలుసుకున్న పీఎం పాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

'ఉదయకిరణాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాబివర్ధన్

సీతంపేట: రచయిత డాక్టర్ మీగడ శశిభూషణ స్వామి ఆటవెలదిలో అద్భుతమైన పదజాలంతో రచించిన ఉదయకిరణాలు శతకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమని ఏయూ జర్నలిజం పూర్వ విభాగాధిపతి ఆచార్య పి.బాబివర్ధన్ అన్నారు. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భాషను, భావాన్ని సమన్వయం చేసుకుంటూ, సమాజాన్ని, మానవీయ కోణాన్ని తన రచనలో ఆవిష్కరించారన్నారు. సుమతీ శతకం, వేమన శతకంలా శశిభూషణ స్వామి రాసిన ఉదయకిరణాలు శతకం మంచి పేరును సంపాదిస్తుందని ఆకాంక్షించారు. సీనియర్ జర్నలిస్ట్ నాగబోయిన నాగేశ్వరరావు పుస్తక సమీక్ష చేశారు. సమాజంలోని ప్రతి అంశాన్ని తీసుకుని పద్య రూపంలో పొందుపర్చారన్నారు. పుస్తక రచయిత శశిభూషణ స్వామి మాట్లాడుతూ కరోనా సమయంలో బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో సమాజానికి ఏదైనా చెయ్యాలన్న ఆలోచన శతక పద్యాలను రాసేలా చేసిందన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ జి.రాజేశ్వరరావు, రచయిత పి.చంద్రభూషణం, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

జూలో సూచిక బోర్డుల ఏర్పాటు



జూలో వన్యప్రాణులను సూచించే బోర్డు, మ్యాప్ పరిశీలిస్తున్న చిన్నారి

ఆరిలోవ: ఇందిరా గాంధీ జులాజికల్ పార్కులో వన్యప్రాణులను చూసి సంబరపడతారు. జూకు వెళ్లగానే ముందుగా కనిపించిన జంతువులు, పక్షులను చూసి సరదా పడతారు. కొన్నింటిని చూడాలని ముందుగానే అనుకొన్నా.. అవి ఎక్కడ ఉన్నాయో తెలియక నిరాశకు గురవుతుంటారు. ఇప్పుడు ఆ సమస్యకు జూ అధికారులు చెక్ పెట్టారు. ఏయే వన్యప్రాణులు ఎటువైపు ఉన్నాయో ముందుగానే తెలుసుకోవచ్చు. ఆ విధంగా జూ అధికారులు పలు చోట్ల సూచిక బోర్డులు, మ్యాప్‌లు ఏర్పాటు చేశారు. వాటికి అనుగుణంగా జూకు వెళ్లే సందర్శకులు వన్యప్రాణులను తిలకించవచ్చు. ఈ బోర్డులు జూ లోపల ప్రధాన ద్వారం, జీబ్రా ఎన్‌క్లోజర్, కనుజులు మోటో ఎదురుగా, జూ కొలను వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎటు వెళ్లే ఏయే వన్యప్రాణులు ఉన్నాయో తెలుసుకోవడానికి ఆ బోర్డుపై వివరాలు రాశారు. జూ లోపలకు ప్రధాన ద్వారం నుంచి ప్రవేశించే సందర్శకులు ఎడమ వైపు తిరిగితే నల్ల హంసలు, ఖడ్గమృగం, ఏనుగులు, కోతులు జోన్, చింపాంజీలు, చిరుతలు, పెద్ద పులులు(ఎల్లో), తెల్ల పులులు, ఆఫ్రికన్ పక్షులు, సింహాలు, మీర్ క్యాట్‌లు, ఎలుగుబంట్లు, బయోస్కోప్ వరకు చేరుకోవచ్చు. ప్రధాన ద్వారం వద్ద కుడి వైపు వెళ్తే ఆస్ట్రిచ్, ఈమూ, నిశాచర జీవుల గుహ, జీబ్రా, జిరాఫీలు, నెమళ్ల జోన్, అడవి దున్నలు, కణుజులు, లవ్ బర్డ్స్ జోన్, చుక్కల జింకలు, పాముల జోన్, నీటి ఏనుగులు, సీతకోక చిలుకల పార్కు, బయోస్కోప్ వరకు చేరుకోవచ్చు. సాగర్ ద్వారం నుంచి జూ లోపలకు ప్రవేశించేవారు ఘరియల్(మొసళ్లు), మొసళ్ల జోన్ మీదుగా పాముల ఎన్‌క్లోజర్‌కు చేరుకోవచ్చు. జూలో ఏ ద్వారం నుంచి ప్రవేశించినా మళ్లీ అదే ద్వారం వద్దకు చేరుకోవడానికి సుమారు మూడున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ దారి మధ్యలో వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లు ఉన్నాయి. ఇంత దూరం నడవలేని వారు, సమయం ఎక్కువగా పడుతుంది అనుకొనేవారు ఇక్కడ అందుబాటులో ఉన్న బ్యాటరీ వాహనాలపై ప్రయాణించి జూ అంతా చుట్టి రావచ్చు. వీటితో పాటు ఇక్కడ అందుబాటులో ఉన్న బ్యాటరీ సైకిళ్లపైనా తిరుగుతూ వన్యప్రాణులను తిలకించే అవకాశం ఉంది.

బ్రాహ్మిణ్ వ్యాపారులకు అండగా ఉంటాం

సీతంపేట: బ్రాహ్మణ వ్యాపారవేత్తలకు సహకారం అందజేయడం, వారి వ్యాపారాభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యంగా బిజినెస్ బై బ్రాహ్మిణ్ పనిచేస్తోందని సంస్థ గౌరవ అధ్యక్షుడు చెరువు రామకోటయ్య తెలిపారు. శంకరమఠంలో ఆదివారం జరిగిన బిజినెస్ బై బ్రాహ్మిణ్ విశాఖ చాప్టర్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. వ్యాపారం ప్రారంభించాలనుకునే ఔత్సాహికులు, బ్రాహ్మణ చిరు వ్యాపారులకు బిజినెస్ బై బ్రాహ్మిణ్ అండగా నిలుస్తుందన్నారు. వ్యాపారానికి కావలసిన మౌలిక సదుపాయాలు, ఆర్థిక వనరులు, వ్యాపారాభివృద్ధిపై సమగ్ర అవగాహన కల్పించి సహాయం అందిస్తామని చెప్పారు. సంస్థ ప్రెసిడెంట్ ధవళ మధుసూదనరావు, సెక్రటరీ పరిమి నాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో అధిక సంఖ్యలో బ్రాహ్మణ వ్యాపారవేత్తలు, ఔత్సాహిక వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

'ఉక్కు'ను విక్రయిస్తే ప్రతిఘటన తప్పదు

అగనంపూడి : తెలుగు రాష్ట్రాల ప్రజల ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కును విక్రయించాలని చూస్తే పెద్ద ఎత్తున ప్రతిఘటన తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల సారథ్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ శక్తుల్లో కీలుబొమ్మగా మారిన కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ధరకు అప్పగించాలని చూస్తుందని, ఇటువంటి ప్రయత్నాలను అడ్డుకుని తీరుతామన్నారు. మూడేళ్లకు పైగా ఉద్యోగులు, ప్రజా సంఘాలు ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను విరమించుకోవాలని శాంతియుత నిరసనా కార్యక్రమాలు చేపడుతుంటే పట్టనట్టు వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని ప్రకటించే వరకు ఉద్యమం ఆగదన్నారు. 1270వ రోజు దీక్షా శిబిరంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్మథరావు, జె.అచ్యుతరావు, నాయకులు కొండలరావు, కసిరెడ్డి సత్యనారాయణ, మసేనురావు, జె.రామకృష్ణ, రెహమాన్, రాజబాబు, నరసింగరావు, మంత్రి రవి, మంగరాజు, నాగరాజు పాల్గొన్నారు.